

ఆదిత్య ప్రొఫెసర్ రాంబాబుకు డాక్టరేట్

ప్రజాశక్తి-గండేపల్లి

ఆదిత్య యూనివర్సిటీ ఇంగ్లీష్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ బాసిరెడ్డి రాంబాబు గుంటూరులోని కెఎల్.యూనివర్సిటీ డాక్టరేట్ ఇచ్చినట్లు ఆదిత్య యూనివర్సిటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ నల్లమిల్లి సతీష్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాంబాబు సమర్పించిన థీసిస్‌కు డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ పొందారని తెలిపారు. రాంబాబు భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆదిత్య అధినేత డాక్టర్ ఎన్.శేషారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.



బాసిరెడ్డి రాంబాబు

సీటు దొరికితే చాలు

- రద్దీకి తగ్గట్టు లేని బస్సులు
- ఉచిత బస్సు పథకంతో ప్రయాణాలు
- సమయానికి చేరలేక విద్యార్థుల ఆందోళన

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

స్టూడెంట్ బస్ పాసులు ఉన్నా ఉపయోగం లేదని, పూర్తిస్థాయిలో బస్సులు అందుబాటులో లేక అనేక అవస్థలు ఎదుర్కొంటున్నామని ఇటీవల జగ్గంపేట మండలం జె.తిమ్మాపురం, కాట్రావులపల్లికి చెందిన పలువురు విద్యార్థులు రోడ్డెక్కి ఆందోళన నిర్వహించారు. పెద్దాపురం నుంచి జగ్గంపేట వెళ్లే రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేశారు. దీతో ట్రాఫిక్ స్తంభించింది. పోలీసులు వచ్చి విద్యార్థులను శాంతింపజేశారు. ఇటీవల ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు పథకం వల్ల ఉన్న బస్సులపైనే అదనపు భారం పడుతోంది. దీంతో విద్యార్థులు సహా సాధారణ ప్రయాణికులు సైతం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న బస్సులపైనే అదనపు భారం పడుతోంది.

కాకినాడ జిల్లాలో 304 ఆర్‌టిసి బస్సులు నడుస్తున్నాయి. వీటిల్లో వెన్నెల ఎసి బస్సులు 2, నైట్ రైడర్స్ 2, అమరావతి 4, ఇంద్ర ఎసి బస్సులు 17, స్టార్ లైనర్ 4, సూపర్ లగ్జరీలు 57, అల్ట్రా డీలక్స్ 24, ఎక్స్‌ప్రెస్‌లు 19, అల్ట్రా పల్లె వెలుగు 39, పల్లె వెలుగు బస్సులు 136 ఉండగా ఇవి రోజుకు 1,14,630 కిలోమీటర్లు నడుస్తున్నాయి. సరాసరి రోజుకి సుమారు 80 వేల మంది ప్రయాణిస్తున్నారు. రోజుకి దాదాపు రూ.52 లక్షల వరకూ ఆర్‌టిసికి ఆదాయం సమకూరుతోంది.

నిత్యం రద్దీ

ఈ ఏడాది ఆగస్టు 15 నుంచి 'స్త్రీ శక్తి' పథకం పేరుతో రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించింది. అప్పటి నుంచి బస్సులన్నీ రద్దీగా మారాయి. సూపర్ సిక్స్ పథకంలో భాగంగా ప్రభుత్వం ఉచిత సౌకర్యం కొన్ని బస్సులకే పరిమితం చేయడంతో ఉన్న వాటిపైనే ఆదనపు భారం పడుతోంది. బస్సుల సంఖ్యను పెంచకుండా పథకం అమలు చేయడంతో సిబ్బందిపై ఒత్తిళ్లు ఎక్కువయ్యాయి. ప్రయాణికుల రద్దీకు తగ్గట్టు బస్సులు పెంచాల్సి ఉన్నా ప్రభుత్వం ఆ దిశగా ఎటువంటి చర్యలూ తీసుకోలేదు. పల్లె వెలుగు, ఆల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులకు మాత్రమే ఉచిత ప్రయాణం సౌకర్యం అవకాశం ఉండడంతో వాటిలో ఎక్కువ మంది ప్రయాణాలు చేస్తున్నారు. దీంతో కిక్కిరిసిపోయి బస్సులు నడుస్తున్న పరిస్థితి ఏర్పడింది.



భారీగా పెరిగిన ఆక్యుపెన్సీ

ఉచిత బస్సు పథకంతో ఆక్యుపెన్సీ 100 నుంచి 150కు పెరిగింది. ప్రస్తుతం బస్సుల్లో సిటింగ్ కెపాసిటీ 55గా ఉంది. ఫ్రీ బస్సు విధానం తరువాత ప్రయాణికులు రెట్టింపు ఎక్కుతున్నారు. బస్సుల్లో ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు తరచూ తోపులాట, వివాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటికే కాకినాడ డిపో నుంచి తుని, రాజమండ్రి, అటు అమలాపురం, తాళ్లరేవు వంటి ప్రాంతాలకు వెళుతున్న బస్సుల్లో రద్దీ విపరీతంగా ఉంటోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో బస్సులో నిలుచునేందుకు కూడా ఖాళీ ఉండడం లేదు. ఇప్పుడు ఉచిత బస్సు సర్వీస్ వల్ల ఈ రద్దీ మరింత పెరిగి విద్యార్థులు, ఇతరులు ప్రయాణించడానికి సమస్యలు ఏర్పడుతున్నాయి. కండక్టర్లు, డ్రైవర్లపై ఒత్తిడి పెరుగుతోంది. ఎక్కి దిగే ప్రయాణికులను నియంత్రించాలంటే తలకు మించిన భారంగా మారుతోంది.

అక్టోబర్ విప్లవ స్ఫూర్తిని కొనసాగిద్దాం

ప్రజాశక్తి-కాకినాడ, పెద్దాపురం

ప్రపంచ గతిని మార్చిన మహత్తర అక్టోబర్ విప్లవ స్ఫూర్తిని కొనసాగిస్తూ, కార్మిక, కర్షక ఐక్యతతో పార్టీని బలోపేతం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కరణం ప్రసాదరావు పిలుపు ఇచ్చారు. అక్టోబర్ విప్లవ దినోత్సవం, సిపిఎం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక సుందరయ్య భవన్‌లో పార్టీ నగర కన్వీనర్ పలివెల వీరబాబు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ప్రసాదరావు అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. సీనియర్ నేత దువ్వా శేషబాబ్జి, నగర కమిటీ సీనియర్ నేత కె.సత్తిరాజు సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కరణం ప్రసాదరావు, శేషబాబ్జి, సిహెచ్.రమణి, సిహెచ్.రాజ్ కుమార్, సత్తిరాజు, సూరిబాబు మాట్లాడారు. మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో లెనిన్ నాయకత్వంలో కార్మిక రాజ్యం ఏర్పడి ప్రపంచానికి వెలుగు దారి చూపిందన్నారు. స్టాలిన్ నాయకత్వంలో జర్మన్ ఫాసిజాన్ని మట్టి కరిపించి రష్యన్ రెడార్మీ ప్రపంచానికి శాంతిని ప్రసాదించిందన్నారు. భారత దేశంలో కీలకమైన ప్రభుత్వ రంగ సంస్థల నిర్మాణానికి సోవియట్ రష్యా అందించిన సహకారం ఎనలేనిదని కొనియాడారు. 1964 నవంబర్ 7 వ తేదీన కలకత్తా మహాసభలో సిపిఎం ఆవిర్భవించిందన్నారు. కార్మిక, కర్షక రాజ్య స్థాపనకై సిపిఎం నికరంగా మార్క్సిజం లెనినిజాన్ని అన్వయిస్తూ ముందుకు సాగుతోందన్నారు. మలకా వెంకటరమణ, ఎం.వెంకటరమణ, చంద్రమళ్ల పద్మ, కె.వీరబాబు, కె.సింహాచలం, యు.సత్యనారాయణ, సిహెచ్.అజయ్‌కుమార్, టి.రాజా, అనపర్తి ఏడుకొండలు, టి.రాణి, ఆర్.తలుపులమ్మ, ఎం.సూర్య ప్రకాష్, సత్యం, వెంకటేష్, పవన్ పాల్గొన్నారు.



కాకినాడలో అరుణ పతావిష్కరణ చేస్తున్న నాయకులు

పెద్దాపురం అక్టోబర్ విప్లవం ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల్లో పోరాటాలకు స్ఫూర్తినిచ్చి ప్రపంచ గతిని మార్చిందని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్ కుమార్ అన్నారు. స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు నీలపాల సూరిబాబు అధ్యక్షతన అక్టోబర్ విప్లవ దినోత్సవంలో ఆయన మాట్లాడారు. కూనిరెడ్డి నరసింహమూర్తి, దారపురెడ్డి క్రాంతికుమార్, సిరపరపు శ్రీనివాస్, గడిగట్ల సత్తిబాబు, గరికపాటి పెంటయ్య, మహాపాతిన రాంబాబు, సిరపరపు మరిడియ్య, గూనూరి వెంకటరమణ, తైనాల శ్రీను, స్నేహ, టిఎల్.పద్మావతి, రత్నం, లక్ష్మి, గంగ, రొంగల సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు మేలు చేసేలా పని చేయాలి

ప్రజాశక్తి - జగ్గంపేట

రైతులకు మేలు విధంగా ఆత్మ కమిటీ పని చేయాలని ఎంఎల్‌ఎ జ్యోతుల నెహ్రూ సూచించారు. ఆత్మ కమిటీ ప్రమాణ స్వీకారం శుక్రవారం స్థానిక కాపు సామాజిక భవనం వద్ద శుక్రవారం నిర్వహించారు. వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు జి.శ్రీనివాస్ చైర్మన్ పైడిపాల సూరిబాబు, 24 మంది కమిటీ సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం నూతన చైర్మన్, సభ్యులను నెహ్రూ సత్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఎంఎల్‌ఎ మాట్లాడుతూ రైతులకు అన్ని రకాల ఆధునిక వ్యవసాయ పద్ధతులూ అందించాలన్నారు. లాభసాటి వ్యవసాయానికి కావాల్సిన అన్ని రకాల యాజమాన్య పద్ధతుల ద్వారా రైతులకు అందించే విధంగా పని చేయాలన్నారు. ప్రత్తిపాడు ఎంఎల్‌ఎ వరుపుల సత్యప్రభ మాట్లాడుతూ ఈ ఆత్మ కమిటీ జగ్గంపేట నియోజకవర్గంలోని గండేపల్లి, జగ్గంపేట ప్రత్తిపాడు నియోజకవర్గంలోని ఏలేశ్వరం, ప్రత్తిపాడు మండలాలకు సంబంధించిందన్నారు. రైతులకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తూ ఆత్మ కమిటీని మరింత బలోపేతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్, జనసేన ఇన్‌ఛార్జి తుమ్మలపల్లి రమేష్, ఎంపిపి తోట రవి, కుంచే రాజా, సర్పంచ్ కందుల చిట్టిబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ అడపా భరత్ పాల్గొన్నారు.



నూతన కమిటీతో ప్రత్తిపాడు, జగ్గంపేట ఎంఎల్‌ఎలు

వంతెనను వాడుకలోకి తేవాలి

ప్రజాశక్తి-పిఠాపురం

పి.దొంతమూరులో సుద్దగడ్డ కాలువపై అసంపూర్తిగా నిర్మించిన వంతెనను వాడుకలోకి తీసుకురావాలని గ్రామస్తులు, రైతులు శుక్రవారం రిలే నిరాహార దీక్ష చేపట్టారు. వంతెన నిర్మాణం పూర్తయ్యి వాడుకలోకి వస్తే పి.తిమ్మాపురం, వెల్దుర్తి, పి.దొంతమూరు, గొల్లప్రోలు మండలంలోని చినజగ్గంపేట, తాటిపర్తి, గ్రామాల ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుందని తెలిపారు. స్థానిక ఎంఎల్‌ఎ, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తమ ఇబ్బందులను గుర్తించి తక్షణమే నిధులు కేటాయించి అప్రోచ్ రోడ్లను వేయించి వంతెనను వాడుకలోకి తీసుకురావాలని కోరారు. కర్రి ప్రసాద్, ఆర్.శ్యామ్‌సన్, కె.సోమరాజు, కె.మాణిక్యం పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న గ్రామస్తులు



మత్స్యకారులతో మాట్లాడుతున్న చైర్మన్

కేన్సర్‌పై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి- తాళ్లరేవు, కరప

క్యాన్సర్ వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తాళ్లరేవులోని గాడిమొగ పిహెచ్‌సి వైద్యులు ఈశ్వర్ అన్నారు. జాతీయ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా జార్జిపేటలో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. గుట్కా, ఖైనీ వంటి పొగాకు పదార్థాలు తీసుకోవడం వల్ల క్యాన్సర్‌కు గురవుతారని, దీర్ఘకాలిక వ్యాధులు పట్ల అశ్రద్ధ చేయవద్దని వైద్యులు తెలిపారు. ప్రాథమికంగా రెండు కేసులు గుర్తించి పరీక్షలకు పంపించినట్లు తెలిపారు. ఎంఎల్‌హెచ్‌పి హేమంత్, ఎఎన్‌ఎం వరలక్ష్మి, హెచ్ఎస్ ఆంజనేయులు పాల్గొన్నారు.

కరప మండలం నడకుదురులో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జె.నరసింహ నాయక్ పాల్గొని మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ సరైన అవగాహన కలిగి ఉండాలన్నారు. నిరంతరం క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్ట్ చేయించుకోవడం ద్వారా వ్యాధి ముందస్తు గుర్తింపు సాధ్యమవుతుందని తెలిపారు. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ కెవి.సుబ్బరాజు, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ ఐ.ప్రభాకర్, డాక్టర్ వి.అరుణ, పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ఏంజలిన్ పాల్గొన్నారు.



కరపలో ర్యాలీలో పాల్గొన్న జిల్లా వైద్యాధికారి నాయక్



ఆందోళన చేస్తున్న నేషనల్ హైవే నిర్మాణ కార్మికులు

జీతాల కోసం హైవే కార్మికుల ఆందోళన

ప్రజాశక్తి కాకినాడ

కాకినాడ-అచ్చంపేట జంక్షన్ నుంచి పోర్టు వరకు హైవే నిర్మాణ పనులు చేస్తున్న కార్మికులకు 6 నెలల బకాయి జీతాలను తక్షణం చెల్లించాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ వద్ద ఆందోళన చేశారు. సిఐటియు నగర కన్వీనర్ మలకా వెంకటరమణ, కో కన్వీనర్ మేడిశెట్టి వెంకటరమణ మాట్లాడారు. నేషనల్ హైవే నిర్మాణ పనులకాంట్రాక్టర్ సంతోష్ కార్మికుల చేత పనులు చేయించుకుని ఆరు నెలల నుంచి జీతాలు ఇవ్వకపోతే వీరి కుటుంబాలను ఎలా పోషించుకుంటారని ప్రశ్నించారు. బకాయి జీతాలు వెంటనే చెల్లించకపోతే సిఐటియు ఆధ్వర్యంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్మికుల జీతాలు ఇప్పించడంలో జిల్లా అధికార యంత్రాంగం తగు చర్యలు తీసుకుని కాంట్రాక్టర్ వారితో కార్మికులు జీతాలు ఇప్పించేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ, గోవిందు, వెంకటేష్, రాజశేఖర్, తరుణ్, ఆకాష్ పాల్గొన్నారు.

మత్స్యకారులకు ఉద్యోగావకాశాలు ఇవ్వాలి

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి

తీర ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్న పరిశ్రమల్లో స్థానిక మత్స్యకారులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని ఆలిండియా ఫోర్ట్ ట్రస్ట్ వర్కర్స్ ఫెడరేషన్ ఎపి చైర్మన్ షేక్ ఖలీఫతుల్లా బాషా డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన ఉప్పాడ, సుబ్బంపేట, కొత్తపట్నం గ్రామాల్లో పర్యటించి మత్స్యకారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పరిశ్రమల కాలుష్యం వల్ల మత్స్య సంపద అంతరించిపోతుందని స్థానికంగా ఏర్పాటు చేసిన పరిశ్రమల్లో స్థానిక మత్స్యకారులకే ఉద్యోగావకాశాలు ఇవ్వకపోవడం, తదితర ప్రతి అంశాన్నీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్లి త్వరితగతిన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపి ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ రఫీ, ఎపి ఆర్‌టిఐ జెఎసి అధ్యక్షుడు పప్పు దుర్గా రమేష్, ముస్లిం థింకర్స్ ఫోరం కన్వీనర్ హసన్ షరీఫ్ పాల్గొన్నారు.

వ్యాపారాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

ప్రజాశక్తి-పెదపూడి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఇస్తున్న ప్రోత్సాహాన్ని అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకుని అభివృద్ధి సాధించాలని జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ గణపతి అన్నారు. పెదపూడిలో వెలుగు కార్యాలయంలో ఎపిఎం వి.అరుణ అధ్యక్షతన ఎంఎస్ఎంఇలపై చిన్న మధ్య తరగతి వ్యాపారాలు చేస్తున్న మహిళలకు రెండో దపా వర్క్‌షాపు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపిఎం అరుణ మాట్లాడుతూ వ్యాపారాలు చేస్తున్న మహిళలంతా ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన ఉద్యమ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఉద్యమ రిజిస్ట్రేషన్ ద్వారా వ్యాపారాలకు ప్రభుత్వ గుర్తింపు ధృవపత్రం, బ్యాంకు రుణం, వడ్డీపై రాయితీ, ఉచితంగా ప్రయోజనం పొందవచ్చన్నారు. 60 మంది రిజిస్ట్రేషన్లు చేయించుకోన్నారన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రేషన్ కో ఆర్డినేటర్ పవన్, ఐపిఒ రాజేష్, క్లస్టర్ కో ఆర్డినేటర్ శ్రీను, రమేష్, సూర్యకుమారి, సిబ్బంది రాజు తదితరులు పాల్గొన్నారు.

'ప్రతిభ'లో మూడు రోజుల్లో ఆరు భాషలు

ప్రజాశక్తి - సామర్లకోట

మూడు రోజుల్లో ఆరు భాషలు నేర్చుకోవడం సాధ్యం కాదు అనే అపోహను చెరిపేసి సామర్లకోట ప్రతిభ విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు తమ అద్భుత ప్రతిభతో అందరినీ ఆశ్చర్యపరిచారు. ఫ్రెంచ్, జర్మన్, స్పానిష్, ఇటాలియన్, జపనీస్, ఇంగ్లీష్ భాషల్లో బేసిక్స్, వాక్య నిర్మాణం, ఉచ్చారణలను కేవలం మూడు రోజుల్లో నేర్చుకుని వాటిని పాటల్లా ప్రదర్శిస్తూ పిల్లలు తమ భాషా పటిమను చూపించారు. ఈ అరుదైన కార్యక్రమానికి పోలిగ్లోట్ ఆఫ్ ఇండియా, ఫ్రెంచ్ నావలిస్ట్ వెంకట్ పూలబాల శిక్షకునిగా వ్యవహరించారు. ఆయన మార్గదర్శకత్వంలో విద్యార్థులు ఆరు భాషల ప్రాథమిక పరిజ్ఞానం సంపాదించారని, తమ ప్రతిభతో అద్భుతంగా ప్రదర్శించారని పూలబాల ప్రశంసించారు. విద్యా సంస్థల అధినేత ఎస్‌వివిజి.ప్రకాష్, కరస్పాండెంట్ సుధారాణి ప్రకాష్ తదితరులు విద్యార్థులను ప్రశంసించారు.



వేదికపై భాషా ప్రావీణ్యం ప్రకటిస్తున్న ప్రతిభా విద్యార్థులు

21, 22న వ్య.కా.సంఘం జిల్లా మహాసభ


ప్రజాశక్తి- తాళ్లరేవు

ఈ నెల 21, 22న తాళ్లరేవులో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభలు నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు టేకుమూడి ఈశ్వరరావు, ఉపాధ్యక్షులు కూరాకుల సింహాచలం తెలిపారు. శుక్రవారం ప్రజా సంఘాల భవనంలో నిర్వహించిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. మండల కార్యదర్శి నేరేడుమిల్లి త్రిమూర్తులు సంఘం కార్యకలాపాల నివేదిక వివరించారు. సంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు, విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు అత్తిలి బాబూరావు మాట్లాడారు. అనంతరం మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్ష కార్యదర్శులుగా దుప్పి అదృష్ట దీపుడు, నేరేడుమిల్లి త్రిమూర్తులు, 20 మందితో మండల కమిటీ ఏర్పడింది. ఈ సమావేశంలో గోడి భాస్కరరావు, బత్రాజు వెంకటలక్ష్మి, పొన్నాడ సత్యనారాయణ, కర్రి రమణమ్మ, గునిపే రాంబాబు, భూలక్ష్మి, కట్ట దీపిక, ఎం.సత్యవతి, మీరాబాయి, ప్రకాశరావు, బి.సత్యనారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షులు ఈశ్వర రావు

కార్టూ'నిజం'



వందేమాతరం గీతంతో జాతి జాగృతం

వందేమాతరం జాతిని జాగతం చేసిన గీతమని పలువురు అన్నారు. వందేమాతరం 150వ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లావ్యాప్తంగా సామూహిక గానం చేశారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

కాకినాడ సిటీ ఎంఎల్‌ఎ వనమాడి వెంకటేశ్వరరావు స్థానిక సాలిపేట గర్ల్స్ హైస్కూల్లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సుమారు 2 వేల మంది విద్యార్థినిలు వందేమాతరం సామూహికగానం చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ వనమాడి కొండబాబు మాట్లాడుతూ వందేమాతరం ఉద్యమ స్ఫూర్తితో ఏడాది పాటు వేడుకలను నిర్వహించనున్నట్లు తెలిపారు. డిఇఒ పిల్లి రమేష్ మార్కెట్ కమిటీ చైర్మన్ బచ్చు శేఖర్, మల్లిపూడి వీరు, పాల్గొన్నారు.

జిల్లా పరిషత్ కార్యాలయంలో జెడ్‌పి చైర్మన్ వి.వేణుగోపాలరావు, జెడ్‌పి సిఇఒ లక్ష్మణరావు ఇతర సిబ్బందితో వందేమాతరం గేయాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా వందేమాతరం గేయ రచయిత బంకించంద్ర ఛటర్జీ చిత్రపటానికి పూలమాలలతో అలంకరించారు. ఎఒ మందపల్లి బుజ్జిబాబు పాల్గొన్నారు. పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన వేడుకల్లో జిల్లా ఎస్‌పి జి.బిందు మాధవ్ పాల్గొన్నారు.

పిఠాపురం భారతీయుల్లో వందేమాతరం గేయం స్వాతంత్ర కాంక్షలు రగిలించిందని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి అన్నారు. పట్టణంలోని ఆర్‌ఆర్‌బిహెచ్‌ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ ప్రజాప్రతినిధులతో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్వాతంత్ర సమరయోధుల చిత్రపటాలకు పులమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులతో కలిసి కలెక్టర్ వందేమాతరం గేయాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ తుమ్మల రామస్వామి, పిఠాపురం మాజీ ఎంఎల్‌ఎలు ఎస్‌విఎస్ఎన్ వర్మ, పెండెం దొరబాబు, ఆర్‌డిఒ ఎస్.మల్లి బాబు, పాడా ఎపిడి వసంత మాధవి పాల్గొన్నారు. హార్వెస్ట్ స్కూల్లో పాఠశాల కరస్పాండెంట్స్ పి.సత్య మోహన్‌రెడ్డి, వి.సత్యానంద రెడ్డి పాల్గొన్నారు.



కాకినాడలో పాల్గొన్న ఎంఎల్ కొండబాబు

సామర్లకోట మున్సిపల్ కార్యాలయం వద్ద కమిషనర్ అనిశెట్టి శ్రీవిద్య సిబ్బంది, ఉద్యోగులు వందేమాతర గీతం ఆలపించారు. బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్లో హెచ్‌ఎం తోటకూర సాయిరామకృష్ణ ఆధ్వర్యంలో ఎంఇఒలు వై.శివరామకృష్ణయ్య, పి.పుల్లయ్య, నూతలపాటి అప్పలకొండ, బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



పిఠాపురంలో వందేమాతరం గీతం ఆలపిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్

గండేపల్లి ఆదిత్య యూనివర్సిటీ ప్రాంగణంలో గల వివిధ కళాశాల, విభాగాలకు చెందిన సిబ్బంది విద్యార్థులు వందేమాతరం గేయం ఆలపించారు. డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ మేడపాటి శ్రీనివాస రెడ్డి, వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎంబి.శ్రీనివాస్, వైస్ ఛాన్సలర్లు డాక్టర్ ఎస్.రమాశ్రీ, డాక్టర్ ఆదిరెడ్డి రమేష్, పాల్గొన్నారు.

గొల్లప్రోలు తహశీల్దారు కార్యాలయంలో వందేమాతరం గీతం ఆలపించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు రామ్‌కుమార్, డిటి సౌజన్య, ఆర్ఐ బాలకృష్ణ, ఆర్‌డిటి ఎస్‌కె.మస్తానీ పాల్గొన్నారు.

కష్టమైనా ఇష్టంగా పని చేయాలి

ప్రజాశక్తి - జగ్గంపేట

వచ్చిన అవకాశాన్ని వదులుకోకుండా కష్టమైనా ఇష్టంగా పని చేస్తే జీవితంలో స్థిరపడతారని ఎంఎల్‌ఎ జ్యోతుల నెహ్రూ అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో నిర్వహించిన జాబ్ మేళాను ఆయన ప్రారంభించి మాట్లాడారు. నిరుద్యోగులుగా ఉన్న వారికి మంచి అవకాశం వచ్చిందన్నారు. 10 కంపెనీలు ఈ జాబ్ మేళాలో పాల్గొన్నాయని వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కళాశాల అభివద్ధి కమిటీ డైరెక్టర్ దేవరపల్లి మూర్తి, ప్రిన్సిపల్ చెన్నారావు, టిడిపి నాయకులు ఎస్‌విఎస్.అప్పలరాజు, అడపా భరత్, కొత్త కొండబాబు, పాలచర్ల నాగేంద్ర చౌదరి, జీను మణిబాబు, పాండ్రంకి రాంబాబు పాల్గొన్నారు.



జాబ్ మేళాలో మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ నెహ్రూ

నేరాలు ఘోరాలు

డివైడర్‌ను ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - నిడదవోలు

పట్టణంలో ఓవర్ బ్రిడ్జ్ వద్ద శుక్రవారం ఉదయం ద్విచక్రవాహనంపై వెళ్తున్న యువకులు డివైడర్ను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో చాగల్లు మండలం మార్కొండపాడుకు చెందిన నామనకోట సత్యం అక్కడికక్కడే మృతి చెందగా, అరిగళ్ళ సాయిదుర్గ, నాగిరెడ్డి మంగెస్కేర్ తీవ్ర గాయాల పాలయ్యారు. క్షతగాత్రులను స్థానికులు హుటాహుటిన ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం తరలించారు. యువకులు ముగ్గురు టైల్స్ పని నిమిత్తం వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



బియ్యం స్వాధీనం చేసుకున్న వ్యాన్ల వద్ద అధికారులు

పిడిఎస్ బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి - నల్లజర్ల

మండలంలోని అనంతపల్లి శివారు వీరవల్లి టోల్ ప్లాజా వద్ద అక్రమంగా రవాణా చేస్తున్న పిడిఎస్ బియ్యాన్ని విజిలెన్స్, సివిల్ సప్లై అధికారులు స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం రెండు బొలెరో వాహనాల్లో తరలిస్తున్న సుమారు 8 టన్నుల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని ముగ్గురు వ్యక్తులపై పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసినట్లు విజిలెన్స్ అధికారి మధుబాబు, సివిల్ సప్లై అధికారి కె.విజయ్‌కుమార్ తెలిపారు. రేషన్ బియ్యం ఏలూరు పరిసర ప్రాంతాల నుంచి కొనుగోలు చేసి కాకినాడ పోర్టుకు తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారంతో వాహన తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో వ్యాను పై వరకు బియ్యం ప్రభుత్వ సంచులతో నింపి పైన ఒక లేయర్ పనికిరాని కొబ్బరికాయలతో రవాణా చేస్తుండగా గుర్తించి బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు వారు తెలిపారు.

భార్యపై కొడవలితో దాడి

ప్రజాశక్తి - గోపాలపురం

భార్యపై అనుమానం పెంచుకున్న భర్త మద్యం మత్తులో కొడవలితో భార్యపై దాడి చేసిన సంఘటన మండలంలోని దొండపూడి గ్రామంలో గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది.. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..దొండపూడి మేదరపేటకి చెందిన కాసాని రామకృష్ణ తన భార్య సింధుజపై అనుమానం పెంచుకున్నాడు. ఈ క్రమంలో గురువారం అర్ధరాత్రి 1.00 సమయంలో మద్యం మత్తులో భార్యపై కొడవలితో దాడి చేశాడు. ఈ దాడిలో ఆమెకు తీవ్ర గాయాలు కావడంతో హత్యా ప్రయత్నం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ముగ్గురిపై కేసు నమోదు

ప్రజాశక్తి - కొవ్వూరు

కొవ్వూరు పట్టణానికి చెందిన దేశభక్తుల వెంకటేశ్వరరావు తనను చీటీల పేరుతో మోసగించినట్లు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు సిఐ పి.విశ్వం తెలిపారు. అనంగపాల్ వారి వీధికి చెందిన గూటాల లీలాదేవి, వెంకట సత్యనారాయణ, యాగాటి బుజ్జి అనే ముగ్గురు తాము రిజిస్టర్ చీటీలను నడుపుతున్నట్లు నమ్మించి చిట్టీలు కట్టించుకున్నారని, 2023 జూన్ లో రూ.5 లక్షలు తన భార్య పేరుతో 2023 డిసెంబర్ నుంచి రూ.3 లక్షలు చిట్టి కట్టించుకున్నారన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో చీటీలు పాడినప్పటికీ ఇంతవరకు సొమ్ము చెల్లించలేదని ఫిర్యాదు చేశారన్నారు. ఏ విధమైన రిజిస్ట్రేషన్ లేకుండా అక్రమంగా చీటీలు నడపడంతోపాటు, రూ. 8 లక్షలు కట్టించుకుని మోసం చేశారని ఫిర్యాదు చేశారన్నారు. ఈ మేరకు ముగ్గురు నిందితులపై కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు

రాజవరంలో సారా స్వాధీనం

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మండలంలోని రాజవరం గ్రామంలో ఎక్సైజ్ సిఐ కె.కాత్యాయని శుక్రవారం తన సిబ్బందితో సారా స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సారా విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులో తీసు కొని అతను వద్దనుండి ఐదు లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. అతనిపై కేసు నమోదు చేసి కొత్తపేట కోర్టులో హాజరు పరచగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎక్సైజ్ సిఐ తెలిపారు.

గంజాయి కేసులో ముగ్గురు అరెస్ట్

ప్రజాశక్తి-గండేపల్లి

గండేపల్లి గ్రామ శివారు ఎన్‌టి.రాజపురం రోడ్డులో ఒక కారు స్వాధీనం చేసుకుని ముగ్గురిని గంజాయితో అదుపులోనికి తీసుకున్నట్టు ఎస్ఐ శివ నాగుబాబు తెలిపారు. వారి వద్ద 21.7 కేజీల గంజాయి, 3 మొబైల్ ఫోన్లు, రూ.2 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. వీరిపై పలు పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదైనట్టు సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్ తెలిపారు. వారిని పెద్దాపురం కోర్టుకి రిమాండ్ నిమిత్తం తరలించినట్టు తెలిపారు.

కాల్వలో పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-గండేపల్లి

మండలంలోని ఉప్పలపాడుకు చెందిన యాడాల దుర్గాప్రసాద్(21) ఉప్పలపాడు గ్రామ శివారులో ఉన్న పోలవరం కాలువ వద్ద కాలకృత్యాలకు వెళ్లి ప్రమాదవశాత్తు కాల్వలో పడి మృతి చెందాడు. శుక్రవారం అతడి మృతదేహాన్ని గుర్తించి అతడి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

ప్రేమ పేరుతో మోసం : వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి

పెళ్లి చేసుకుంటానని ప్రేమ పేరుతో బాలికను మోసి చేసిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు పిఠాపురం సిఐ శ్రీనివాస్, ఎస్ఐ వెంకటేష్ తెలిపారు. అమీనాబాద్ గ్రామానికి చెందిన కొండ అంజిబాబు గత సంవత్సరం నుంచి బాలికను పెళ్లి చేసుకుంటానని చెప్పి శారీరక సంబంధం పెట్టుకున్నాడని, దీంతో ఆ బాలిక గర్భవతి కావడంతో మాత్రలు ఇచ్చి అబార్షన్ చేయించినట్టు తెలిపారు. పెళ్లి చేసుకోమని అడుగుతున్నా కొండబాబు నిరాకరించడంతో బాలిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు కొండబాబును అరెస్టు చేసిన కోర్టుకు తరలించినట్లు తెలిపారు.

యానాం వార్తలు



ఆందోళన చేస్తున్న కాంగ్రెస్, విసికె, సిఐటియు నాయకులు

విద్యుత్ ఛార్జీల పెంపుపై ఆందోళన

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలు పెంచడంతో కాంగ్రెస్ పార్టీ, విసికె పార్టీ, సిఐటియు ఆధ్వర్యంలో శుక్రవారం ఆందోళన చేపట్టారు. స్థానిక ప్రాంతీయ పరిపాలన అధికారి కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ యానాం అధ్యక్షులు అర్థాని దినేష్ మాట్లాడుతూ ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజలపై భారం మోపిందన్నారు. వివిధ టాక్సలతో ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తోందన్నారు. పెంచిన విద్యుత్ ఛార్జీలు వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్ఎఒ అంకిత్ కుమార్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో మెల్లం చిన్న, సిఐటియు దుర్గాప్రసాద్, చెక్కల అరుణ్ కుమార్, పైడికొండల రాజబాబు తదితరులు పాల్గొన్నారు .



ధర్నా చేస్తున్న సిఐటియు నాయకులు దుర్గాప్రసాద్, సత్యనారాయణ, కార్మికులు

లేబర్ ఇన్‌స్పెక్టర్‌ను నియమించాలని ధర్నా

ప్రజాశక్తి - యానాం

కార్మికుల సమస్యలు పట్టించుకునే వారు లేరని, కార్మికుల సమస్యలను తెలిపేందుకు లేబర్ అసిస్టెంట్ ఇన్స్పెక్టర్ యానాంలో లేకపోవడంపై సిఐటియు ఆధ్వర్యంలో నాయకులు, కార్మికులు ప్రాంతీయ పరిపాలనాధికారి కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షుడు గుదే దుర్గాప్రసాద్ మాట్లాడుతూ గత సంవత్సరం నుంచి లేబర్ కార్యాలయంలో లేబర్ అసిస్టెంట్ ఇన్స్పెక్టర్ లేరని గత పరిపాలనాధికారి ఆర్.మునిస్వామికి పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. కార్మికులు అనేక సమస్యలతో బాధపడుతున్నారని ఆ సమస్యను చెప్పుకోవడానికి సంబంధిత అధికారి లేకపోవడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు కన్వీనర్ కుంచే సత్యనారాయణ, అనసూరి శ్రీనివాసరావు, తిరుకోటి శ్రీనివాసరావు, సబ్బతి రాంబాబు, దాసరి రాజు, కె మధుబాబు, రాజశేఖర్, నాగబాబు, హరికష్ణ తదితరులు పాల్గొన్నారు.



వందేమాతరం గీతాన్ని ఆలపిస్తున్న విద్యార్థులు

ఘనంగా వందేమాతరం గీతాలాపన

ప్రజాశక్తి - యానాం

వందేమాతరం గేయాన్ని రచించి 150 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు శుక్రవారం స్థానిక రాజీవ్ గాంధీ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ ప్రాంగణంలో విద్యార్థులు వందేమాతర గేయాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా స్థానిక ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, ఆర్ఎఒ అంకిత్ కుమార్ పాల్గొని కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. ఉపాధ్యాయుడు హంసాని రామలక్ష్మణుడు వందేమాతర గేయం విశిష్టతను విద్యార్థులకు వివరించారు. ముందుగా వందేమాతరం గేయ రచయిత బంకించంద్ర చటర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారి పంపన లక్ష్మణ ప్రవీణ్, ఎడిపిసి కమిడి ప్రభాకర్ పాల్గొన్నారు.

3వ రోజుకు ఎఫ్‌టిసిఎల్‌ఆర్ ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి - యానాం

యానాం ప్రజాపనుల శాఖలో 20 ఏళ్ల నుంచి ఎఫ్‌టిఎల్‌ఆర్‌లుగా పనిచేస్తోన్న 126 మందిని పర్మినెంట్ చేయ్యాలని సిబ్బంది మూడో రోజు కూడా నిరసన చేపట్టారు. శుక్రవారం ప్రజా పనుల శాఖ కార్యాలయం వద్ద మూడో రోజు గేట్ మీటింగ్ నిర్వహించారు. పిడబ్ల్యుడి కార్యాలయం ఎదుట ప్లకార్డులతో ఆందోళన చేశారు. ఈ నిరసనకు ప్రముఖ వ్యాపారవేత్త తోటరాజు మద్దతు పలికి సంఘీభావం తెలిపారు. అరదాడి పోసియ్య, కర్రి పేర్రాజు, మున్నా, బాబీ పాల్గొన్నారు.

భార్య గొంతు కోసి... భర్త ఆత్మహత్య

ప్రజాశక్తి- తాళ్లరేవు

మనస్పర్థల కారణంగా భార్యపై హత్యాయత్నం చేసి అనంతరం భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. కోరంగి పోలీసులు తెలిపిన వివరాల మేరకు కాకినాడ జిల్లా కాజులూరు మండలం శీల గ్రామానికి చెందిన చీపురుపల్లి రాజేష్, దేవిలకు 14 ఏళ్ల క్రితం వివాహమైంది. కొంతకాలం వారి కాపురం సజావుగానే సాగింది. ఇటీవల వారి మధ్య మనస్పర్థలు వచ్చాయి. ఈ కారణంగా కాకినాడ డ్రైవర్స్ కాలనీలో తల్లి ఇంటి వద్ద దివ్య ఉంటుంది. శుక్రవారం రాజేష్ కాకినాడలో ఉంటున్న భార్య దేవి వద్దకు వెళ్లాడు. కత్తితో ఆమె గొంతు కోసి పరారయ్యాడు. రక్తపుమడుగులో ఉన్న దివ్యను కుటుంబ సభ్యులు హుటాహుటిన కాకినాడ జిజిహెచ్‌కు తరలించారు. ప్రస్తుతం ఆమె చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతోంది. పరారైన రాజేష్ తాళ్ళరేవు మండలంలోని పటవల పంట పొలాల వద్దకు వెళ్లాడు. కత్తితో తన గొంతు కోసుకుని మరణించాడు. ఘటనా ప్రాంతాన్ని కోరంగి ఎస్ఐ సత్యనారాయణ పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు.

రెజ్లింగ్‌లో విద్యార్థినులకు గోల్డ్ మెడల్స్

ప్రజాశక్తి - సామర్లకోట

వేట్లపాలెం కొండపల్లి గంగన్న మెమోరియల్ జెడ్‌పి పాఠశాల విద్యార్థినులు రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలలో సత్తా చాటారు. కృష్ణాజిల్లాలో ఈ నెల 6 వరకూ జరిగిన రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో ఈ పాఠశాల విద్యార్థినులు అండర్-14 విభాగంలో దాసరి సుదీష్ట గోల్డ్ మెడల్ సాధించగా, అండర్-17 విభాగంలో దాసరి హారికశ్రీ గోల్డ్ మెడల్ అందుకున్నారు. వీరిద్దరూ అక్క చెల్లెళ్లు కావడం విశేషం. వారిని హెచ్‌ఎం పి.అనురాధ, గ్రామ సర్పంచ్ చిల్లి వెంకటలక్ష్మి, ఉప సర్పంచ్ గోలి శ్రీరామ్, ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు, విద్యా కమిటీ చైర్మన్ పి.నాగశివ, వైస్ చైర్మన్ జి.రేవతి, కొండపల్లి కృష్ణమూర్తి, గుమ్మళ్ల రామకృష్ణ పాల్గొన్నారు.

చేబ్రోలులో కోటి సంతకాల సేకరణ

ప్రజాశక్తి గొల్లప్రోలు

ప్రభుత్వం మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ వ్యతిరేకిస్తూ వైసిపికోటి సంతకాల కార్యక్రమం ప్రారంభించారు. మండలంలోని చేబ్రోలు గ్రామంలో జెడ్‌పిటిసి ఉలవకాయల నాగ లోవరాజు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున సంతకాలు సేకరించారు. ఈ కార్యక్రమానికి అపూర్వ స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో ఓరుగంటి చక్రధరుడు, ములికే సత్యనారాయణ, ఓరుగంటి ప్రసాద్ పాల్గొన్నారు.

పాలనా వ్యవస్థలపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - సామర్లకోట

బాలల హక్కుల వారోత్సవాల సందర్భంగా అధికారులతో విద్యార్థులు మమేకమయ్యారు. శుక్రవారం సిడిపిఎఒ జి.ఉష ఆధ్వర్యంలో పట్టణంలో బాలల హక్కుల వారోత్సవాల సందర్భంగా మండల స్థాయి అధికారులతో విద్యార్థులు ఒక రోజు పేరుతో ప్రభుత్వ కార్యాలయాల సందర్శన కార్యక్రమం చేపట్టారు. ఎంఇఒలు వై.శివరామకృష్ణయ్య, పి.పుల్లయ్య, ఎంపిడిఒ కె.హిమ మహేశ్వరి, మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య, తహశీల్దార్ కె.చంద్రశేఖర రెడ్డి, అంగన్‌వాడీ సూపర్వైజర్లు సత్తార్ బీబీ, నిర్మల కుమారి, మంగాదేవి, ఉమాదేవి, నళిని, చంద్రకళ పాల్గొన్నారు.

తాళ్లరేవు ఐసిడిఎస్ అధికారులు మండలం పరిధిలోని అన్ని ప్రాథమికోన్నత పాఠశాలల నుండి 15 మంది విద్యార్థులను ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పోలీస్ స్టేషన్, మండల పరిషత్, రెవెన్యూ, మత్యశాఖ, మహిళా సమాఖ్య, స్త్రీ శిశు అభివృద్ధి శాఖ, పోస్టల్ కార్యాలయాలకు తీసుకువెళ్ళి ఆయా కార్యకలాపాల గురించి వివరించారు. సిడిపిఒ శ్రీదేవి, ఎంఇఒలు మంగయ్యమ్మ, ఉమ, డిప్యూటీ తహశీల్దార్ సూరిబాబు, ఐసిడిఎస్ విస్తరణాధికారులు కనక రత్నం, నాగలక్ష్మి, భవాని, రమణికుమారి, సోషల్ వర్కర్ ఎస్.చిన్నబాబు, ఉపాధ్యాయులు మంగాదేవి, శ్రీదేవి, రమాదేవి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పిఠాపురం సిడిపిఒ సిహెచ్‌ఎస్‌కె.దుర్గాదేవి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి షణ్మోహన్ జెండా ఊపి ప్రారంభించగా ఆర్‌ఆర్‌బిహెచ్‌ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి ఎంపిక చేసిన విద్యార్థులను క్షేత్రస్థాయి అవగాహన కార్యక్రమానికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో ఎంఈఒ జి.శ్యాంబాబు, అగ్రికల్చర్ ఎడిఎ పి.స్వాతి, ఎంపిడిఒ కె.స్వప్న, రూరల్ ఎస్ఐ జాన్ బాషా, జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ బి.దుర్గారాణి, సెక్టార్ సూపర్వైజర్లు అరుణశ్రీ, సత్యనారాయణమ్మ, పాఠశాల హెచ్‌ఎం రామకృష్ణ పాల్గొన్నారు.



కార్యాలయ విధులను విద్యార్థులకు వివరిస్తున్న ఎంపిడిఒ

ఆకట్టుకున్న వేషధారణలు

ప్రజాశక్తి-యు.కొత్తపల్లి

మూలపేటలోచ శుక్రవారం సంప్రదాయ కత్తిపోట్ల వేషాలు నిర్వహించారు. వేషధారణలను తిలకించేందుకు అధిక సంఖ్యలో ప్రజలు వచ్చారు. ఈ కత్తిపోటు వేషాలు పురాతన కాలం నుంచి వస్తున్న ఆచారం ఉంది. చేనేత గ్రామాల్లో ఏటా ఇలవేల్పుగా భావించే గౌరీదేవిని అనగా వరి దుబ్బును ఇంట్లో ప్రతిష్టిస్తారు. నెల రోజుల తర్వాత సరస్సులో నిమజ్జనం చేస్తారు. ఈ సందర్భంగా ఈ వేషాలు వేస్తారు.



వేషధారణలో ఉన్న గ్రామస్తులు

సత్యదేవుని ఆదాయం రూ.1.73 కోట్లు

ప్రజాశక్తి-శంఖవరం

అన్నవరం సత్యనారాయణ స్వామికి హుండీల లెక్కింపు ద్వారా రూ.1.73 కోట్ల ఆదాయం లభించింది. శుక్రవారం కొండపైన చైర్మన్ ఐవి.రోహిత్, ఇఒ వీర్ల సుబ్బారావు. ఆధ్వర్యంలో అధికారులు 30 రోజుల్లో వివిధ హుండీల్లో కానుకలను లెక్కించారు. ఈ లెక్కింపులో నగదుతో పాటు 37 గ్రాములు బంగారం, 800 గ్రాముల వెండి, వివిధ దేశాలకు చెందిన కరెన్సీ లభ్యమైనట్లు అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం డిప్యూటీ కమిషనర్ బాబూరావు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

టీచ్ టూల్ రిఫ్రెషర్ శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి - సామర్లకోట

వరల్డ్ బ్యాంక్ ఆధ్వర్యంలో అమలవుతున్న సాల్ట్ ప్రోగ్రామ్‌లో భాగంగా టీచ్ టూల్ శిక్షణ పొందిన సర్టిఫైడ్ అబ్జర్వర్లకు మండలంలో రెండు రోజుల రిఫ్రెషర్ కోర్స్ శిక్షణను ప్రారంభించారు. శుక్రవారం స్థానిక స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో కోర్స్ డైరెక్టర్‌గా ఎంఇఒ వై.శివరామకృష్ణయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శిక్షణలో పాల్గొంటున్న 28 మంది ఉపాధ్యాయులు తమ పాఠశాలల్లో ఇతర ఉపాధ్యాయులకు టీచ్ టూల్ పద్ధతులను పరిచయం చేసి, సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ-2 పి.పుల్లయ్య, హెచ్‌ఎం తోటకూర సాయిరామకృష్ణ, మాస్టర్ ట్రైనర్లు కె.వేదాద్రి శ్రీనివాస్, వై.గురుప్రకాష్ పాల్గొన్నారు.

వ్యవస్థకు ఉపయోగపడేలా ఉండాలి

ప్రజాశక్తి - జగ్గంపేట

వ్యవస్థకు ఉపయోగపడే వ్యక్తులుగా తయారుకావాలని ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా ఐసిడిఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఒకరోజు క్షేత్ర స్థాయి అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం స్థానిక కాపు కళ్యాణ మండపం వద్ద ఎంఎల్ఎ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాయకత్వ లక్షణాలను అలవర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. వారం రోజులు ఈ కార్యక్రమాలను సమర్థవంతవంతంగా నిర్వహించి విద్యార్థులకు ప్రతి విషయంపై అవగాహన కలిగించాలన్నారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులను పోస్టాఫీస్, పోలీస్ స్టేషన్, తహసీల్దార్, మండల పరిషత్, వ్యవసాయ, అగ్నిమాపక కార్యాలయాలకు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తీసుకువెళ్లి ఆయా శాఖల అధికారులు సిబ్బంది సేవలు ఏ విధంగా ప్రజలకు ఉపయోగపడతాయో తెలిపారు.

ప్రజాదర్బార్‌తో ప్రజలకు ప్రభుత్వం చేరువ

ప్రత్తిపాడు : ప్రభుత్వాన్ని ప్రజలకు చేరువ చేయడమే ప్రజా దర్బార్ లక్ష్యమని ప్రత్తిపాడు ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభ అన్నారు. శుక్రవారం పెదశంకర్లపూడిలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంఎల్ఎ సత్యప్రభ పాల్గొన్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తానన్నారు.

రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలి

పెద్దాపురం : మండల పరిధిలో రెవెన్యూ సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని తహశీల్దారు సిహెచ్.వెంకటలక్ష్మి విఆర్‌ఒలను ఆదేశించారు. శుక్రవారం స్థానిక తహశీల్దారు కార్యాలయంలో విఆర్‌ఒలతో రెవెన్యూ సమస్యల పరిష్కారంపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు.

పాఠశాలల పటిష్టతకు బాధ్యత తీసుకోవాలి

జగ్గంపేట : ప్రభుత్వ పాఠశాలల విద్యావ్యవస్థ పటిష్టతకు కొత్త టీచర్లందరూ బాధ్యత తీసుకోవాలని ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ సూచించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పివివి.సత్యనారాయణ అధ్యక్షతన నూతన టీచర్లకు సర్వీస్ రిజిస్టర్‌లను ఎంఎల్ఎ పంపిణీ చేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్ అడపా భరత్, క్లస్టర్ ఇన్‌ఛార్జి కన్నబాబు, దేవరపల్లి మూర్తి, ఎంపిడిఒ ఎవిఎస్.చంద్రశేఖర్, ఎంఇఒ-2 సుబ్రహ్మణ్యేశ్వర రావు, యుటిఎఫ్ గౌరవాధ్యక్షుడు ఎంవి.సాయిరాం, మండల యుటిఎఫ్ అధ్యక్షుడు గొర్రెల వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి

పిఠాపురం సిఐ జి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉప్పాడ కొత్తపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని కోనపాపపేట, అమీనాబాద్ గ్రామాల్లో సైబర్ నేరాలపై శుక్రవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ శ్రీనివాస్ మాట్లాడుతూ బ్యాంకు, క్రెడిట్ కార్డు వివరాలు, ఆధార్, ఎటిఎం పిన్ నంబర్లు, వ్యక్తిగత బ్యాంకింగ్ సమాచారం, ఒటిపిలు ఎవరికీ చెప్పొద్దన్నారు. సోషల్ మీడియాలో వస్తున్న అసత్య కథనాలను నమ్మరాదని, అవి గందరగోళానికి దారి తీయవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వెంకటేష్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌లో కమిషనర్ తనిఖీలు

ప్రజాశక్తి పెద్దాపురం

స్థానిక మున్సిపల్ సెంటర్‌లోని అన్న క్యాంటీన్‌ను శుక్రవారం మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి తనిఖీ చేశారు. క్యాంటీన్‌లో, క్యాంటీన్ పరిసరాలలో పరిశుభ్రత, ఆహార పదార్థాల నాణ్యత పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ జ్యోతి రాణి, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైసిపిలో కష్టపడే వారికి గుర్తింపు

ప్రజాశక్తి-ప్రత్తిపాడు

పార్టీలో కష్టపడే కార్యకర్తలకు ఎప్పుడు గుర్తింపు ఉంటుందని వైసిపి కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నారు. ఏలేశ్వరం మండలం సి.రాయవరం గ్రామానికి చెందిన వైసిపి నాయకులు గుమ్ములూరి వెంకటరమణ జిల్లా వాలంటరీ విభాగం ఉపాధ్యక్షునిగా నియమితులైన సందర్భంగా వెంకటరమణ గిరిబాబును మర్యాదపూర్వకంగా కలిసి తన సేవలను గుర్తించి పార్టీ పదవి ఇవ్వడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. గిరిబాబు మాట్లాడుతూ పార్టీకి సేవలు చేసే నాయకులను కార్యకర్తలను గుర్తించినట్టు తెలిపారు. గుమ్ములూరి వెంకటరమణ మాట్లాడుతూ పార్టీని బలోపేతం చేయడానికి కష్టపడి పని చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో గొల్లపల్లి సురేష్, గొల్లపల్లి కాశి, బెహరా దొరబాబు, సామంతుల కుమార్, కోరాడ ప్రసాద్, పోలం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాలు మంజూరు

తాళ్లరేవు : తుపాను నేపథ్యంలో మత్స్యకారులకు సంబంధించి 3960 మందికి కుటుంబానికి 50 కేజీల బియ్యం, కేజీ కందిపప్పు, కేజీ పంచదార, ఒక లీటర్ పామాయిల్, కేజీ ఉల్లిపాయలు మంజూరైనట్టు తహశీల్దారు పి.త్రినాథరావు తెలిపారు. రెండో విడతలో భాగంగా శుక్రవారం 4,133 మంది ఇతర కార్డుదారులకు ఒక్కొక్కరికి 25 కేజీలు బియ్యం, నిత్యవసర సరుకులు మంజుర య్యాయని ఆ బియ్యాన్ని పునరావాస కేంద్రాల్లో ఉన్న లబ్ధిదారులకు పంపిణీ చేయాలని డీలర్లను ఆదేశించినట్లు తెలిపారు.